క్లుప్తంగా

బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ విద్యాసాగర్



ఓర్వకల్లు: మండల నూతన తహసీల్దార్‌గా విద్యాసాగర్ శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ తహసీల్దార్‌గా విధులు నిర్వర్తిస్తున్న వెంకటరమణ నంద్యాల జిల్లాకు బదిలీకాగా ఆయన స్థానంలో గడివేముల తహసీల్దార్‌గా పనిచేసిన విద్యాసాగర్‌ను ఉన్నతాధికారులు నియమించారు. రెవెన్యూ, భూపరమైన సమస్యలను సకాలంలో పరిష్కరించడానికి కృషి చేస్తామని విద్యాసాగర్ తెలిపారు.

సబ్‌రిజిస్ట్రార్‌గా తేజోవతి..



కోడుమూరు రూరల్: కోడుమూరు సబ్ రిజిస్ట్రార్‌గా తేజోవతి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సబ్ రిజిస్ట్రార్‌గా విధు లు నిర్వహిస్తున్న మహబూబ్‌బాషా ఇటీవల డోన్‌కు బదిలీ అయ్యారు. పాణ్యం సబ్ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న తేజోవతిని ఉ న్నతాధికారులు కోడుమూరుకు బదిలీ చేశారు. తేజోవతిని కార్యాలయ సిబ్బంది పూలమాలతో సత్కరించి అభినందనలు తెలిపారు.

ఏఈ మహ్మద్ ఇస్మాయిల్

కర్నూలు రూరల్ : కర్నూలు మండల విద్యుత్ ఏఈగా మహమ్మద్ ఇస్మాయిల్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రజల విద్యుత్ సమస్యలు పరిష్కరించేందుకు అంకిత భావంతో విధులు నిర్వహిసానని ఆయన చెప్పారు.

కంది సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



కంది పంటను పరిశీలిస్తున్న ఏఓ రవిప్రకాష్

కోడుమూరు రూరల్: కంది పంట ప్రస్తుతం పూత దశకు చేరుకుంటున్న నేపథ్యంలో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏఓ రవిప్రకాష్ సూచించారు. మండలంలోని ప్యాలకుర్తి గ్రామంలో రైతులు సాగు చేసిన కంది, కూరగాయల పంటలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఏఓ మాట్లాడుతూ కంది మొగ్గ, పూత దశకు చేరుకుంటున్నందున మొదట పూత మందునే పిచికారీ చేయాలన్నారు. పంటలో ఏదైనా పురుగు ఉన్నట్‌లైతే వెంటనే వేపనూనె, ఇమామెక్టిన్ డేంజర్ లాంటి సాధారణ మందులను పిచికారీ చేసుకోవాలని సూచించారు. అనంతరం ఏఓ గ్రామంలోని రైతు సేవా కేంద్రాన్ని తనిఖీ చేశారు. రికార్డులు, సిబ్బంది హాజరును పరిశీలించారు.

నివాళి

కర్నూలు (రూరల్) : ఆర్‌డీఓ కార్యాలయంలో శుక్రవారం దివంగత నాయకుడు సుధాకర్ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ జనరల్ సెక్రటరీగా పనిచేసిన సుధాకర్ 2001 సంవత్సరంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందారని ఏఓ వేణుగోపాల్‌రావు గుర్తు చేశారు. కార్యక్రమంలో కర్నూలు డివిజన్ ఏపీఆర్ఎస్ఏ సభ్యులు ప్రెసిడెంట్ రామాంజనేయులు, సెక్రటరీ వేణుగోపాల్‌రావు, ట్రెజరర్ సాహెరా బాను, కార్యవర్గ సభ్యులు కృష్ణమూర్తి, సనా అఫ్రీన్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



శివప్రసాద్‌ను సన్మానిస్తున్న దృశ్యం

గడివేముల: గడివేముల మండల సర్వేయర్‌గా పనిచేస్తున్న శివప్రసాద్ నంద్యాల రూరల్‌కు బదిలీ కావడంతో రెవెన్యూ సిబ్బంది, గ్రామ సర్వేయర్లు సన్మానించారు. గడివేములకు నంద్యాల ఏడీ కార్యాలయంలో పనిచేస్తున్న మధును నియమితులయ్యారు.

పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత



మాట్లాడుతున్న అనీసాపా

ఓర్వకల్లు: పర్యావరణ పరిరక్షణ అందరం బా. ద్యతగా తీసుకోవాలని అంతర్జాతీయ మానవ హక్కుల కమిషన్ రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు అనీసాపాషా పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. మనజీవితం, మనుగడ మొత్తం పర్యావరణంతో అనుసంధానం అన్నారు. ఆహారం, గాలి, నీరు, ఉష్ణోగ్రత తదితరాలు పర్యావరణంతోనే ముడిపడ్డాయని, కలుషితం కాకుండా బాధ్యతగా కాపాడుకోవాలన్నారు. ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని నిషేధించాలన్నారు. కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరూ కనీసం ఓ మొక్కను నాటడడంతోపాటు సంరక్షించాలని ఆమె పిలుపునిచ్చారు.

రోడ్లు అధ్వానం..ప్రయాణం నరకం !

- కనీసం మరమ్మతులకు నోచుకోని రహదారులు
- అడుగుకో గుంత దర్శనమిస్తున్న వైనం
- పట్టించుకోని పాలకులు, అధికారులు
- ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు



గోతులమయమైన వెల్దుర్తి రోడ్డు



కోడుమూరు ఆర్‌టీసీ బస్టాండ్ సమీపంలో నడిరోడ్డుపై గొయ్యి



కోడుమూరు - ఎమ్మిగనూరు రోడ్డు దుస్థితి

కోడుమూరు రూరల్: ప్రజా సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందనేందుకు ప్రత్యక్ష సాక్ష్యాలు గుంతలమయమైన రహదారులు. నియోజకవర్గ కేంద్రం కోడుమూరులో చాలా వరకు రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. దీనికితోడు ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో మరీ దారుణంగా మారాయి. ఈ రోడ్లపై ప్రయాణం నరకప్రాయంగా మారింది. రాకపోకలకు బాటసారులు, వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎక్కడ ఏ గుంతలో పడుతామన్న భయంతో కోడుమూరులో వాహనదారులు రాకపోకలు సాగిస్తున్నారు. దెబ్బతిన్న రోడ్లకు అధికారులు సకాలంలో మరమ్మతులు చేయకపోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురువుతున్నారు. కోడుమూరులో ఆర్‌టీసీ బస్టాండ్ సర్కిల్, ఎమ్మిగనూరు రహదారిలో నడిరోడ్డుపై భారీగా గోతులేర్పడ్డాయి. రాత్రి వేళల్లో నడిరోడ్డులో ఉన్న గుంతలను గమనించకుండా వెళ్లి వాహనదారులు ప్రమాదాల భారీన పడుతున్నారు. ముఖ్యంగా ద్విచక్రవాహనదారులు ఎక్కువగా ప్రమాదాలకు గురువుతున్నారు. అలాగే కోడుమూరు నుంచి వెల్దుర్తికి వెళ్లే రోడ్డు పరిస్థితి అంతే. ఈ మార్గంలో వెంకటగిరి నుంచి లద్దగిరి వరకు సుమారు 12 కిలోమీటర్ల మేర పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. వర్షపునీరు గుంతల్లో చేరడంతో అంచనా వేయలేక వాహనచోదకులు ప్రమాదాలకు గురైన సంఘటనలు కోకొల్లలు. కేవలం 12 కిలోమీటరుల ప్రయాణించేందుకు అరగంట పడుతుందంటే రోడ్డు ప్రస్థితి ఇట్టే అర్థం అవుతుంది.

రోడ్డును కప్పేస్తున్న ముళ్లపొదలు

కోడుమూరు నుంచి కర్నూలుకు వెళ్లే రోడ్డులో మొండికట్టవాగు వంతెనపైన కంపచెట్లు ఏపుగా పెరిగాయి. రోడ్డును కప్పేస్తున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యారు. ఎదురెదురుగా వాహనాలు వచ్చిన సందర్భాల్లో ముళ్లపొదల మూలంగా వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళల్లో రోడ్డుపైకి వచ్చిన కంపచెట్లను గమనించకుండా వెళ్లి ద్విచక్ర వాహనదారులు గాయాల పాలవుతున్నారు.

దెబ్బతిన్న వంతెన...

కోడుమూరు నుంచి బళ్లారికి వెళ్లే రోడ్డులో హంద్రీపై కిలోమీటరుకుపైగా ఉన్న వంతెన దెబ్బతిన్నట్లు ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వంతెనకు ఇరువైపులా మట్టి పేరుకుపోవడంతో వర్షపునీరు నిలిచిపోతుంది. అదేవిధంగా వంతెనపై గుంతలు పడ్డాయి. అక్కడక్కడ పగుళ్లు ఏర్పడినట్లు ప్రయాణికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కనీసం రోడ్లకు మరమ్మతులు చేయించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



కుంటను తలపిస్తున్న గడివేముల నుంచి వెలుగోడుకు వెళ్లే రహదారి



బురదమయంగా దుర్వేశి రోడ్డు

రోడ్లు ఛిద్రం.. ప్రయాణం ప్రమాదకరం

గడివేముల: మండల పరిధిలోని రహదారులు ఛిద్రమయ్యాయి. గుంతలయమై అధ్వానంగా మారాయి. దీంతో ప్రయాణాలు ఇబ్బందిగా మారాయి. మండల కేంద్రం గడివేముల నుంచి దుర్వేసి, మంచాలకట్ట, కొరప్రోలురు, కరిమద్దెల గ్రామాలకు వెళ్లే రహదారులు అధ్వానంగా ఉన్నాయి. ఇటీవల కురిసిన వర్షానికి రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నాయి. రోడ్డు దెబ్బతినడంతో గుంతల్లో వర్షపు నీరు నిలిచి కుంటలను తలపిస్తున్నాయి. ప్రతి చిన్నపనికి మండల కేంద్రానికి వెళ్లాలంటే ఇదే ప్రధానమైన మార్గం. రోడ్లు గుంతలు పడడంతో బస్సు ప్రయాణం సైతం ఇబ్బందిగా మారింది. బస్సులో చివరి సీట్లలో కూర్చున్న ప్రయాణికులు బాధలు వర్ణనాతీతం. మండల పరిధిలోని జిందాల్ సిమెంట్ ఫ్యాక్టరీ చెందిన వాహనాలు అధిక లోడుతో వెళ్తున్నాడంతో రోడ్లు దెబ్బతింటున్నాయని వాహనదారులు ఆరోపిస్తున్నారు. అదేవిధంగా నంద్యాల, నందికొట్కూరు ప్రధాన రహదారిలో రోడ్డు గుంతలమయం కావడంతో రాత్రి వేళల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాహనదారులు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, పాలకులు స్పందించి కనీసం రోడ్లకు మరమ్మతులు చేయించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం



కోడుమూరులో ప్రధాన రోడ్లపై గుంతలు భారీగా ఏర్పడ్డాయి. వాటిని సకాలంలో పూడ్చకపోవడంతో మరింత పెద్దవిగా మారాయి. వానలు పడుతున్న సందర్భాల్లో గుంతలను చూసుకోకుండా వెళ్తే కింద పడి దెబ్బలు తగిలించుకోవాల్సిందే. రోడ్లపై ఏర్పడ్డ గుంతల్లో కనీసం మట్టినైనా వేస్తే బాగుంటుంది.

– నాగరాజు ఆచారి, కోడుమూరు

రోడ్లకు వెంటనే మరమ్మతులు చేయించాలి



మండలంలో దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేయకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహారిస్తున్నారు. రోడ్లకు మరమ్మతులు చేయాలని ఎన్ని సార్లు మొరపెట్టుకున్నా తట్టెడు మట్టి కూడా వేయడం లేదు. అధికారులు స్పందించి దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టి వాహనదారుల ఇబ్బందులను తీర్చాలి.

– రాజు, సీపీఐ మండల కార్యదర్శి, కోడుమూరు.

ప్రమాదకరంగా ప్రయాణం



గడివేముల నుంచి నందికొట్కూరుకు వెళ్లే ప్రధాన మార్గం ఈ మధ్య వర్షానికి పూర్తిగా దెబ్బతింది. మోటార్ సైకిల్లో వెళ్లాలంటే భయంగా ఉంటుంది. ప్రయాణం ప్రమాదకరంగా మారింది. కొత్తగా వచ్చేవారు కింద పడిపోతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు సమస్యలను పరిష్కరించాలి.

–జయరాజు, గడివేముల

గుంతలు పూడ్పించాలి



నందికొట్కూరు–నంద్యాల ప్రధాన రహదారి నుంచి దుర్వేశి గ్రామానికి వెళ్లాలంటే రాత్రి వేళల్లో భయంగా ఉంటుంది. వర్షపు నీరు నిలిచిపోవడంతో ఎక్కడ గుంత ఉందో తెలియడం లేదు. ద్విచక్రవాహనచోదకులు గాయాలకు గురైన సంఘటనలు కోకొల్లలు. వర్షాలకు రోడ్డు మరీ అధ్వానంగా మారాయి. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయించాలి.

– రమేష్ , గడివేముల

కార్యకర్తను పరామర్శించిన వైఎస్సార్‌సీపీ నేతలు



చిన్న రంగన్నతో మాట్లాడుతున్న కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, డాక్టర్ ఆదిమూలపు సతీష్

సి.బెళగల్: మండలంలోని పోలకల్ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త చిన్న రంగన్న కిడ్నీ వ్యాధితో బాధపడుతూ కర్నూలు ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.విషయం తెలుసుకున్న కోడుమూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ శుక్రవారం ఆసుపత్రికి వెళ్లి చిన్న రంగన్నను పరామర్శించారు. చిన్న రంగన్న ఆరోగ్య పరిస్థితిని డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డు డైరెక్టర్ ప్రభాకర్‌రెడ్డి, నాయకుడు బొజ్జన్న తదితరులు పాల్గొన్నారు.

నేడు శ్రీచెన్నకేశవస్వామి ఆలయంలో పూజలు

కోడుమూరు రూరల్: తిరుపతి లడ్డు విషయంలో సీఎం చంద్రబాబు నాయుడు చేస్తున్న ఆరోపణలను నిరసిస్తూ కోడుమూరులోని 1వ వార్డులో ఉన్న శ్రీచెన్నకేశవస్వామి ఆలయంలో శనివారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమేష్‌నాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

బాలాజీ ఆలయంలో....

గడివేముల: మండల పరిధిలోని బిలకలగూడూరు గ్రామ సమీపంలో ఉన్న బాలాజీ ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి శుక్రవారం తెలిపారు.మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి పిలుపు మేరకు తిరుపతి లడ్డూ విషయంలో జరుగుతున్న వివాదంలో భాగంగా వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి మండల స్థాయి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు.

క్రిష్ణదొడ్డి కొండపై వెలసిన వేంకటేశ్వరుడుకి....

సి.బెళగల్: మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు శనివారం మండలంలో ప్రత్యేక పూజలను నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ తెలిపారు. తిరుపతి లడ్డూ విషయంలో సీఎం చంద్రబాబు అడ్డగోలు వాదాన్ని ఖండిస్తూ మండల పరిధిలోని క్రిష్ణదొడ్డి కొండపై వెలసిన శ్రీ కోనా వేంకటేశ్వరుడుకి ప్రత్యేక పూజలను నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ప్రతేక పూజలకు మాజీ కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి హాజరవుతారని, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

రాష్ట్రస్థాయి పోటీలకు గురుకుల విద్యార్థులు



పీఈటీని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ ప్రసాద్‌రావు

ఓర్వకల్లు:మండలంలోని కాల్వబుగ్గ గురుకుల పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 26వ తేదీన కర్నూలు జిల్లా క్రీడల అథారిటీ ఆధ్వర్యంలో జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అథ్లెటిక్స్ పోటీల విభాగంలో నిర్వహించిన పోటీలలో తమ విద్యార్థులు ప్రతిభ చాటారని ప్రిన్సిపాల్ పి.ప్రసాద్‌రావు పరుగు పోటీలలో ఎస్. సంతోష్‌నాయక్, అనిల్ కుమార్, ట్రిపుల్ జంప్‌లో ఎస్. రాకేష్, కె.అకిరానందన్, హమ్మర్‌త్రోలో డి. మహబూబ్‌బాషా, కె. రాజశేఖర్, డిస్కస్‌త్రో పోటీలలో పి.మిన్నెల్ల ప్రతిభచాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు. శ్రీకాకుళం జిల్లా, కోడి రామకృష్ణ స్టేడియంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో వీరు పాల్గొంటారన్నారు. విద్యార్థులతోపాటు పీఈటీ లక్ష్మినారాయణను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

పాత మధ్యాహ్న భోజన ఏజెన్సీనే కొనసాగించాలి



ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కోడుమూరు రూరల్: మండలంలోని ప్యాలకుర్తి ఎస్సీ కాలనీలో ఉన్న స్పెషల్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రస్తుతం వంట చేస్తున్న వంట ఏజెన్సీ సభ్యులనే కొనసాగించాలంటూ ఎమ్మార్పీస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎమ్మార్పీస్ నాయకులు రాజు, నాగేష్ శుక్రవారం ప్యాలకుర్తి గ్రామస్తులతో కలిసి కోడుమూరులో ఎంపీడీఓ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్యాలకుర్తి ఎస్సీ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సుజాత అనే వంట ఏజెన్సీ సభ్యురాలు 2018నుంచి మధ్యాహ్నం వేళ పిల్లలకు వంట చేసి పెడుతున్నారన్నారు. అయితే ప్రస్తుతం కొందరు ఆమెను తప్పించి వేరే వారికి వంట ఏజెన్సీ ఇప్పించేందుకు కుట్రలు పన్నుతున్నారని, వీటిని ఏమాత్రం సహించమని హెచ్చరించారు.

విద్యార్థి జీవితంలో ఇంటర్ కీలకం



సమావేశంలో మాట్లాడుతున్న పరమేశ్వరరెడ్డి

కర్నూలు సిటీ: విద్యార్థి జీవితంలో ఇంటర్ కీలకమని, భవిష్యత్తును తీర్చిదిద్దుకునే దశ అని ఇంటర్మీడియెట్ బోర్డు జిల్లా వృత్తివిద్యాధికారి వై.పరమేశ్వర రెడ్డి అన్నారు. శుక్రవారం ప్రభుత్వ జూనియర్(టౌన్ మోడల్)కాలేజీలో ఆ కాలేజీ ప్రిన్సిపాల్ సుంకన్న అధ్యక్షతన టీచర్స్, పెరెంట్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అలాగే ఏ సమయంలో ఇంటి నుంచి కాలేజీకి వెళ్లుతున్నారు..మళ్లీ ఎప్పుడు తిరిగి వస్తున్నారు అనే విషయాన్ని పరిశీలిస్తూ ఉండాలన్నారు. అలాగే అప్పుడప్పుడు పెరెంట్స్ కాలేజీకి వెళ్లి పిల్లల చదువు గురించి అధ్యాపకులతో చర్చించాలని, పరీక్షల్లో వచ్చే మార్కులు, పిల్లలకు అందుతున్న విద్య, తదితర అంశాలను ఎప్పటికప్పుడు అడిగి తెలుసుకోవాలన్నారు. నగరంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో బైపీసీ, ఎంపీసీ చదువుతున్న విద్యార్థులకు ఓ పరీక్ష నిర్వహించి, ఒక్కో గ్రూప్ నుంచి 25 మంది విద్యార్థులను ఎంపిక చేసి జేఈఈ, నీట్ వంటి పోటీ పరీక్షలకు ఉచితంగా కార్పొరేట్ కాలేజీకి చెందిన వారితో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు.

రూ.10 లక్షల పరిహారం చెల్లించాలి

ఓర్వకల్లు: మండలంలోని గుట్టపాడు వద్ద స్థాపిస్తున్న స్టీల్ ప్లాంట్‌లో 40 రోజుల క్రిందట జరిగిన ఘటనలో తీవ్ర గాయాలకు గురైన బాధితునికి రూ.10 లక్షలు పరిహారం చెల్లించాలని సీపీఎం మండల కార్యదర్శి నాగన్న డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నాగన్న మాట్లాడుతూ జైరాజ్ ఇస్పాత్ స్టీల్ ప్లాంట్‌లో పని చేస్తున్న బీహార్ వలస కార్మికులను కలిసి వారి సమస్యలపై ఆరాతీశామన్నారు. పరిశ్రమలో బీహార్ రాష్ట్రానికి చెందిన ఉత్తం కేసరి(24) అనే యువకుడు ఎలక్ట్రికల్ పనిచేస్తున్నాడు. 40 రోజుల క్రితం విధినిర్వహణలో ప్రమాదవశాత్తు 20 అడుగుల ఎత్తునుంచి కేసరి కింద పడడంతో కదలలేని స్థితిలో ఉన్నాడు. అయితే కంపెనీ ప్రతినిధులు వెంటనే బెంగులూరుకు తరలించి ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్సచేయించి, ఒక్కపైసా ఇవ్వకుండా స్వస్థలానికి పంపారన్నారు. బాధితుని తక్షణమే రూ.10 లక్షల పరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కర్నూలు (రూరల్) : కల్లూరు మండల పరిధిలోని పెద్దటేకూరు గ్రామానికి చెందిన కురువ రామచంద్రుడు (60) శుక్రవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. గ్రామ సమీపాన ఉన్న తన పొలంలో పనిచేయడానికి రోడ్డును దాటుతుండగా ఈ దుర్ఘటన జరిగింది. శరీరం మొత్తం ఛిద్రమైంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఉలిందకొండ ఎస్ఐ ధనుంజయ తెలిపారు.

పోలీసుల అదుపులో గజదొంగ

కర్నూలు : నగరంలోని వివిధ కాలనీల్లో ఇళ్ల దొంగతనాలకు పాల్పడి తప్పించుకు తిరుగుతున్న గజదొంగ బుడగజంగాల రమేష్‌ను నాలుగో పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. కొంతకాలంగా గుట్టుచప్పుడు కాకుండా దొంగతనాలకు పాల్పడుతూ చోరీ సొత్తును విక్రయించి జల్సాలు చేసేవాడు. అనుమానంపై పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించి అతని నుంచి దాదాపు అరకిలో బంగారం రికవరీ చేసినట్లు సమాచారం. ఇతనితో పాటు మరో నలుగురిని అదుపులో తీసుకుని పోలీసులు విచారిస్తున్నారు.

చైన్‌స్నాచర్స్ హల్‌చల్

కర్నూలు : కర్నూలు వెంకటరమణ కాలనీలో చైన్ స్నాచర్స్ హల్‌చల్ చేశారు. అమీన్ అబ్బాస్ నగర్ రైతుబజార్ వెనుక నివాసముంటున్న వృద్ధురాలు సుజాతమ్మ (62) ట్యాబ్లెట్ల కోసం శుక్రవారం ఉదయం 8:30 గంటల సమయంలో రోడ్డుపై ఉన్న మెడికల్ షాపు వద్దకు నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు ముఖానికి మాస్కులు ధరించి ద్విచక్ర వాహనంపై ఆమెను సమీపించి మెడలో ఉన్న రెండు తులాల బంగారు గొలుసును లాక్కుని ఉడాయించారు. ఆమె దొంగ దొంగ అని కేకలు వేసేలోగా వాహన వేగం పెంచి పక్క సందులో నుంచి కనిపించకుండా పరారయ్యారు. ఈ మేరకు బాధితురాలు రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దొంగల కోసం గాలిస్తున్నట్లు సీఐ జి.వి.నాగరాజరావు తెలిపారు. అలాగే రామలింగేశ్వర్ నగర్‌లో నివాసముంటున్న కేశవరెడ్డి భార్య జయశ్రీ ఉదయం కిరాణ దుకాణం నుంచి నడుచుకుంటూ ఇంటికి వెళ్తుండగా గొలుసు దొంగలు ఆమెను సమీపించి మెడలో ఉన్న గొలుసును లాక్కునేందుకు ప్రయత్నించగా ఆమె అప్రమత్తమై కేకలు వేసేలోగా దొంగలు పారిపోయారు.

రేపు వరల్డ్ హార్ట్ డే కార్యక్రమాలు



కేక్ కట్ చేస్తున్న మెడికల్ కాలేజ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ

కర్నూలు(హాస్పిటల్): ఈ నెల 29వ తేదీన వరల్డ్ హార్ట్ డే కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల కార్డియాలజి ప్రొఫెసర్ డాక్టర్ పి. చంద్రశేఖర్ చెప్పారు. ఈ మేరకు శుక్రవారం ఆసుపత్రిలోని కార్డియాలజి విభాగంలో కర్నూలు మెడికల్ కాలేజ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. చిట్టినరసమ్మ కేక్ కట్ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గత 20 ఏళ్లకు పైగా నిరంతరాయంగా సీఎంఈలు, వరల్డ్ హార్ట్ డే కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. డాక్టర్ పి. చంద్రశేఖర్ మాట్లాడుతూ 29వ తేదీన మధ్యాహ్నం ఎ.క్యాంపులోని హెల్త్ క్లబ్‌లో నిరంతర వైద్య విజ్ఞాన సదస్సు నిర్వహిస్తున్నామని, ఇందులో తిరుపతికి చెందిన సీనియర్ కార్డియాలజిస్టు డాక్టర్ డి. రాజశేఖర్ హాజరై విద్యాబోధన చేస్తారన్నారు. అనంతరం సాయంత్రం కర్నూలు హార్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో హార్ట్ డే వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం సంగీత విభావరి కార్యక్రమం ఉంటుందని, దీంతో పాటు అనంతపురానికి చెందిన డాక్టర్ హరిప్రసాద్‌చే హాస్యవల్లరి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో కార్డియాలజి ఇన్‌చార్జ్ హెచ్ఓడీ డాక్టర్ లక్ష్మీబాయి, అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ బిందు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

పాణ్యం: సీజనల్ వ్యాధులపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మద్దూరు పిహెచ్‌సీ డాక్టర్ సునీత సూచించారు. మద్దూరు గ్రామంలో 'డ్రైడే ఫ్రైడే '' కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ఆమె పర్యటించి పరిసరాల శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగతంతోపాటు పరిసరాల శుభ్రత పాటించాలని ఈ సందర్భంగా డాక్టర్ సునీత సూచించారు. వర్షాలు కురుస్తున్నందున కాచివడబోసిన నీటినే తాగాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ సుబ్బారెడ్డి , ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



మద్దూరులో ఓ ఇంటి పరిసరాలను పరిశీలిస్తున్న డాక్టర్ సునీత